క్లుప్తంగా

నూతన డీఎస్పీ హనుమంతరావుకు సత్కారం



సత్తెనపల్లి: పల్నాడు జిల్లా సత్తెనపల్లి డీఎస్పీగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన మేదరమెట్ల హనుమంతరావును సత్తెనపల్లి వాసవి మణికంఠ క్లబ్ కమిటీ, సత్తెనపల్లి రోటరీ క్లబ్ ఇంటర్నేషనల్ బాధ్యులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి దుశ్శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఆయా కమిటీల బాధ్యులు బెల్లంకొండ నాగసాయి ప్రసాద్, వనమా నాగేశ్వ రరావు, కొప్పురావూరి కాశీ, సూరే శ్రీనివాసరావు, అనుమాలశెట్టి కోటేశ్వర రావు, దివ్వెల శ్రీనివాసరావు ఉన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోవాలి



సత్తెనపల్లి: ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో విద్యావంతులు, మేధావులు ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీ నారాయణ అన్నారు. పట్టణంలోని రఘురామ్ నగర్‌లోని టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్సీ ఎన్నికలపై సత్తెనపల్లి పట్టణం, సత్తెనపల్లి రూరల్ మండలం ముఖ్య నాయకులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఓట్లు నమోదుకు అవసరమైన పత్రాలు అన్నింటిని అందుబాటులో ఉంచాలన్నారు.

రోగులకు మెరుగైన సేవలు అందించాలి



నకరికల్లు: వైద్యశాలకు వచ్చిన రోగులకు మెరుగైన సేవలు అందించాలని మండల ప్రత్యేక అధికారి బి.బాలూనాయక్ సూచించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి తనిఖీలు నిర్వహించారు. రికార్డులు తనిఖీ చేశారు. మందుల నిల్వలు పరిశీలించారు. ఆపరేషన్ గది, రక్త పరీక్ష కేంద్రంలో వసతులు పరిశీలించారు. రోగులతో మాట్లాడి వారి ఆరోగ్య సమస్యలు అడిగి తెలుసుకొని తగిన మందులు ఇవ్వాలని వైద్యసిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైద్యశాలలో పరిశుభ్రత పాటించాలని, రోగులతో ఆత్మీయతతో మాట్లాడి సేవలు అందించాలని సూచించారు. ఆయన వెంట సచివాలయం -1 కార్యదర్శి కె.వి.ఎస్.ప్రసాద్ పాల్గొన్నారు.

మల్లాదిలో బరిసెలు స్వాధీనం



అమరావతి: మండలంలో మల్లాదిలో పోలీసులు నాకాబందీలో భాగంగా శుక్రవారం తెల్లవారుజామున తనిఖీలు నిర్వహించి బరిసెలను స్వాధీనం చేసుకున్నారు. మూడు నెలల కాలంలో మల్లాదిలో రెండు మూడు సార్లు ఘర్షణల నేపథ్యంలో జిల్లా ఎస్పీ కే శ్రీనివాసరావు ఆదేశాల మేరకు పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సత్తెనపల్లి డీఎస్పీ ఎం .హనుమంతరావు ఆధ్వర్యంలో సుమారు వందమంది పోలీసులకుపైగా తనిఖీల్లో పాల్గొన్నారు. డీఎస్పీ మాట్లాడుతూ నిష్పక్షపాతంగా నిర్వహించి న తనిఖీలలో నాలుగు బడిసెలు, రెండుపొడవాటి కత్తులు, చిన్న కత్తి, కొడవలి, పలుగు ఒక్కొక్కటి, గొ డ్డళ్లు -19, కంకరరాళ్ల మూట, ఆరు ద్విచక్ర వాహనాలు సీజ్ చేసి అమరావతి పోలీస్ స్టేషన్‌కు తరలిస్తున్నామని వెల్లడించారు. తనిఖీలలో సీఐ మాకి నేని శ్రీనివాసరావుతోపాటుగా అచ్చంపేట, క్రోసూరు, పెదకూరపాడు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లు తొలగించాలి

దాచేపల్లి: వ్యవసాయంపై ఎటువంటి విద్యుత్ చార్జీలను పెంచబోమని రైతులకు హామీ ఇచ్చిన ఎన్డీఏ కూటమి ప్రభుత్వం వ్యవసాయ పంపుసెట్లకు ఏర్పాటు చేసిన స్మార్ట్ మీటర్లను తక్షణమే తొలగించాలని భారత్ కిసాన్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరాలపాటి జానీ శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. విద్యుత్, ఇంధన సర్దుబాటు చార్జీల పెంపు ప్రతిపాదనను తక్షణమే ఉపసంహరించుకోవాలని కోరారు. ప్రజలకు ఇచ్చిన హామీలకు పూర్తి వ్యతిరేకంగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందని, విద్యుత్ ఇంధన సర్దుబాటు చార్జీల నెపంతో సుమారుగా రూ.20 వేల కోట్ల భారాన్ని ప్రజలపై మోపేందుకు సిద్ధమైందని ఆయన మండిపడ్డారు.

కొత్త పింఛన్లు సంగతేంటి!

- అక్టోబర్ నుంచి కొత్త పింఛన్లకు కూటమి హామీ
- నేటికీ తెరుచుకొని పింఛన్ వెబ్ సైట్
- అధికారులు కూటమి నాయకుల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్న అర్హులు
- ఉన్న వాటిని తొలగించే యోచనలో కూటమి ప్రభుత్వం



లబ్ధిదారులకు పింఛన్‌లు పంపిణీ చేస్తున్న ఎంపీడీఓ సత్యనారాయణ(ఫైల్)

సత్తెనపల్లి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కొలువు దీరి వంద రోజులు దాటుతోంది. ఇంత వరకు కొత్త పింఛన్ల పంపిణీ పై కార్యాచరణ రూపొందించలేదు. అక్టోబర్ నుంచి కొత్త పింఛన్లను మంజూరు చేస్తామని కూటమి నేతలు ప్రకటించారు. ఈ నేపథ్యంలో అర్హులైన లబ్ధిదారులు పింఛన్ల కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. గత ప్రభుత్వంలో కులాలు, మతాలు, పార్టీలు, రాజకీయాలకు సంబంధం లేకుండా గ్రామ/వార్డు సచివాలయంలో దరఖాస్తు చేసుకుంటే పింఛన్లు మంజూరు చేసే వారు. కూటమి ప్రభుత్వం పింఛన్ల మంజూరుపై ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో గత ప్రభుత్వంలో పింఛన్ కోసం దరఖాస్తు చేసుకున్న వారికి కూడా ఎదురుచూపులు తప్పడం లేదు.

అర్హత ఉన్నా ఎదురుచూపులే...

అర్హులైన వితంతువులు, దివ్యాంగులు, వృద్ధులు కొత్త పింఛన్ల కోసం ఎదురు చూస్తున్నారు. పింఛన్ కోసం దరఖాస్తు చేసుకునేందుకు జిల్లాలోని 538 సచివాలయాలకు రోజూ పదుల సంఖ్యలో లబ్ధిదారులు వెళుతున్నారు. నూతన పింఛన్లకు దరఖాస్తు చేసుకునేందుకు ఇప్పటి వరకు సంబంధిత వెబ్‌సైట్ తెరవకపోవడంతో అర్హులు నిరాశతో వెనుదిరగాల్సి వస్తోంది.

పింఛన్లు తొలగించే కుట్ర...

కొత్త పింఛన్ల మాట దేవుడెరుగు. ప్రస్తుతం వస్తున్న పింఛన్లు తొలగించాలని అధికార పార్టీ నాయకులు కుయుక్తులు పన్నుతున్నారు. ఈ నెలలో గ్రామ/వార్డు సభలు పెట్టి అనర్హత పేరుతో పింఛన్లు తొలగించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. ఉన్న పింఛన్లు తొలగించడానికి అధికార పార్టీ నాయకులు కుట్రలు చేయడంపై తీవ్రస్థాయిలో విమర్శలు వస్తున్నాయి.

గత ప్రభుత్వంలో...

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పింఛన్ కోసం నిత్యం దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఉండేది. దరఖాస్తు చేసుకున్న వారికి ప్రతి ఆరు నెలలకోసారి లబ్ధిదారులను గుర్తించి మంజూరు చేసేవారు. ఈ ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగింది. కానీ నేడు ఆ పరిస్థితి లేదు. కూటమి ప్రభుత్వం పింఛన్లు, రేషన్ కార్డుల వెబ్ సైట్ ను పూర్తిగా నిలిపి వేసింది.

పలువురు అధికారుల బాధ్యతలు స్వీకారం



ఎంపీడీఓ సత్యనారాయణ



ఏఓగా బసవకుమారి



మున్సిపల్ డీఈ వెంకటరమణ

రాజుపాలెం: మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా(ఎంపీడీఓ) జీవీ సత్యనారాయణ శుక్రవారం బా ధ్యతలు స్వీకరించారు. జీవీ సత్యనారాయణ సత్తెనపల్లిలో ఎంపీడీఓగా పనిచేస్తూ సాధారణ బదిలీలో భాగంగా రాజుపాలెం వచ్చారు. మండల పరిషత్ పరిపాలన అధికారిగా సీహెచ్ బసవకుమారి కూడా బాధ్యతలు స్వీకరించారు. సీహెచ్ బసవకుమారి సత్తెనపల్లి ఎంపీడీఓ కార్యలయంలో పాలనాధికారిగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు.

సత్తెనపల్లి ఎంపీడీఓగా శ్రీనివాసరెడ్డి



బండి శ్రీనివాసరెడ్డి

సత్తెనపల్లి: సత్తెనపల్లి మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారిగా బండి శ్రీనివాసరెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా నకరికల్లు ఎంపీడీఓగా పని చేస్తూ బదిలీపై ఆయన సత్తెనపల్లి వచ్చారు. ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ప్రజాప్రతినిధుల సహకారం, అధికారులతో కలిసి ముందుకు వెళతానన్నారు.

మున్సిపల్ డీఈగా వెంకటరమణ

సత్తెనపల్లి: మున్సిపల్ డీఈగా టి.వెంకటరమణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. సాధారణ బదిలీల్లో భాగంగా చిలకలూరిపేట మున్సిపాలిటీ నుంచి ఆయన సత్తెనపల్లి వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ డీఈగా పని చేసిన బి.మధుసూదన్‌రావు గుంటూరు నగర పాలక సంస్థకు బదిలీపై వెళ్లారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డీఈ వెంకటరమణ మర్యాదపూర్వకంగా మున్సిపల్ కమిషనర్ కొలిమి షమ్మిని కలిశారు.

నకరికల్లు-1 కార్యదర్శిగా ప్రసాద్



నకరికల్లు: నకరికల్లు- 1 కార్యదర్శిగా కె.వి.ఎస్.ప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. ఆయన మాట్లాడుతూ నకరికల్లులో గతంలో పనిచేసి ఉన్న అనుభవంతో మెరుగైన సేవలు అందిస్తానని అన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

బెల్లంకొండ: పిడుగురాళ్ల విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల దృష్ట్యా శనివారం సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ పవన్‌కుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట అంతరాయం ఉంటుందని చెప్పారు. మండల పరిధిలోని బెల్లంకొండ, పాపాయపాలెం సబ్‌స్టేషన్ల పరిధిలోని అన్ని గ్రామాల వినియోగదారులు సహకరించాలని కోరారు.



నార్నెపాడులో గాయత్రీదేవి అలంకారంలో అమ్మవారు



ఇనిమెట్ల గ్రామంలో శ్రీకనకదుర్గా అమ్మవారు గాయత్రీదేవిగా భక్తులకు దర్శనం



శ్రీకౌమారీదేవి అలంకారంలో నర్మింగపాడులోని అన్నపూర్ణాదేవిగా అమ్మవారు..



బెల్లంకొండలో గాయత్రీదేవిగా అమ్మవారు..



అచ్చంపేటలోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవాలయంలో లక్ష్మీదేవి అవతారంలో వాసవీమాత



పట్టణంలోని శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో గాయత్రీదేవి

గాయత్రీ దేవిగా అమ్మవారు దర్శనం



75 త్యాళ్లూరులో కుంకుమార్చనలో మహిళలు

దసరా మహోత్సవాల్లో భాగంగా రెండోరోజు గాయత్రీ మాతకు భక్తులు పూజలు చేశారు. సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల్లోని వివిధ ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. గాయత్రీ మాతకు, లలితా సహస్ర నామాలతో, కుంకుమార్చన చేశారు. భక్తులు తెల్లవారుజాము నుంచే ఆలయాలకు వచ్చి పూజల్లో పాల్గొన్నారు.

– నెట్‌వర్క్



పట్టణంలోని సనారి వీరబ్రహ్మేంద్ర ఆశ్రమంలో గాయత్రీదేవి



పట్టణంలోని వెంకటపతి కాలనీలో గాయత్రీ దేవి

జిల్లా పోటీలకు విద్యార్థులు

రెంటచింతల: కంభంపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అండర్-14, అండర్-17 నియోజకవర్గ స్థాయి ఎస్‌జీఎఫ్ కబడ్డీ, వాలీబాల్ పోటీలలో స్థానిక శ్రీ రామకృష్ణ గురుకుల పాఠశాల విద్యార్థులు విశేష ప్రతిభను ప్రదర్శించి జిల్లా పోటీలకు ఎంపికై నట్లు పాఠశాల హెచ్ఎం శ్రీనివాస్, పీఈటీ వెంకటేష్ శుక్రవారం తెలిపారు. కబడ్డీ, వాలీబాల్ అండర్-14, అండర్-17 విభాగాలకు పాఠశాలకు చెందిన మొత్తం 9 మంది విద్యార్థులు నియోజకవర్గ స్థాయి పోటీలలో అత్యుత్తమ ప్రతిభను ప్రదర్శించి జిల్లా జట్లకు ఎంపికైనట్లు తెలిపారు.

అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ

దాచేపల్లి : స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలో జరిగిన అథ్లెటిక్స్ పోటీల్లో తమ విద్యార్థులు ప్రతిభ చూపించారని నడికుడి దుర్గా పబ్లిక్ స్కూల్ ప్రిన్సిపాల్ మల్లికార్జున శాస్త్రీ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అండర్-14, 17 విభాగాల్లో తమ విద్యార్థులు మహతి, యశ్వస్విని రెండు, మూడు స్థానాల్లో నిలిచారని ఆయన చెప్పారు. హైజంప్‌లో సిరి చందన 3వ స్థానం , రేస్‌వార్‌లో సాఫియా 3వ స్థానం, 3కే రన్‌లో సుమిత్‌కుమార్ రెండో స్థానం, 5కే రన్‌లో యశ్వస్విని, రక్షిత రెండో స్థానంలో నిలిచారని ఆయన పేర్కొన్నారు. విజేతలైన విద్యార్థులను సాగర్ సిమెంట్స్ యాజమాన్య ప్రతినిధులు అభినందించారు.

భవన నిర్మాణ కార్మికుల నిరసన

ఇసుక అందుబాటులోకి తేవాలని డిమాండ్



స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న భవన నిర్మాణ కార్మిక సంఘాల నాయకులు

అమరావతి: ప్రభుత్వం ఉచిత ఇసుక ఇస్తున్నామని చెప్పి అసలు ఇసుక దొరకకుండా చేసి భవన నిర్మాణ కార్మికుల పొట్టకొట్టిందని సీఐటీయూ మండల కార్యదర్శి బి.సూరిబాబు పేర్కొన్నారు. సీపీఎం రాష్ట్ర వ్యాప్త పిలుపులో భాగంగా స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం నిరసన తెలిపారు. సూరిబాబు మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు, ప్రభుత్వం అధికారంలోకి వస్తే ఉచిత ఇసుక ఇచ్చి రాష్ట్రంలో ఇసుక సమస్య లేకుండా చేస్తానని చెప్పి అధికారంలోకి వచ్చి వంద రోజులు దాటినా కూడా స్పష్టమైన ఇసుక పాలసీ తీసుకు రావడంలో ప్రభుత్వం విఫలమైందని చెప్పారు. ఈ మూడు నెలల కాలంలో పాత డంపింగ్ యార్డులలో ఇసుక సరఫరా చేసి అధికరేట్లకి అమ్మిన పరిస్థితి అందరం చూశామన్నారు. ఇసుక అందుబాటులో లేకపోవడం వలన గృహనిర్మాణదారులు సుదూర ప్రాంతాల నుంచి వేల రూపాయలతో కొనుగోలు చేసే పరిస్థితి వచ్చిందని ఆరోపించారు. అమరావతి మండలంలో అనే గ్రామాల్లో ఇసుక ర్యాంపులు ఉన్నా ఇసుక అందుబాటులో లేదన్నారు. ఇసుక ర్యాంపులు ద్వారా అర్ధరాత్రి కూటమి నాయకులు మల్లాది, మునగోడులలో ట్రాక్టర్‌లతో, వైకుంఠపురంలో భారీ లారీలతో ఇసుక అక్రమంగా తరలిస్తున్న స్థానిక పోలీస్, రెవెన్యూ అధికారులు పట్టించుప్రభుత్వం ఇసుకపై స్పష్టమైన విధానాన్ని అమలు చేసి ఉచిత ఇసుక సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.


వైఎస్సార్ సీపీ కార్మిక విభాగం నాయకుడు దారా ప్రసాద్ మాట్లాడుతూ మండలంలో రెండు వేల మంది భవన నిర్మాణ కార్మికులకి ఉపాధి లేక కుటుంబాలు జరగటం లేదన్నారు. పిల్లలకు చదువులు ఫీజు లు, ఇంటి అవసరాలు తీర్చలేక అధిక వడ్డీకి అప్పులు చేయాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం తహసీశిల్దార్ నాగమల్లేశ్వరరావుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం రూరల్ కార్యదర్శి సయ్యద్ వలి, భవప నిర్మాణ కార్మిక సంఘాల ప్రతినిధులు లక్ష్మిశెట్టి ఏడుకొండలు, ఆకుల రాంబాబు, స్వామి, ఎస్‌కే రఫీ, సిహెచ్.మురారి, ఎస్. రాజకుమార్, వైఎస్సార్ సీపీ దళిత నాయకులు తోకల సూరిబాబు, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

ఉచిత ఇసుక హామీని వెంటనే అమలు చేయాలి

ముప్పాళ్ల: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఉచితంగా ఇసుక సప్లయి చేస్తామని ప్రకటించిందని, ఇచ్చిన హామీని వెంటనే అమలు చేసి భవన నిర్మాణ కార్మికులకు ఉపాధి కల్పించాలని కార్మిక సంఘం నాయకులు చింతపల్లి నాగమల్లేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉచిత ఇసుక హామీ అమలుపై శుక్రవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం డిమాండ్స్‌తో కూడిన వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి గుంటుపల్లి బాలకృష్ణ, నాయకులు టి.అమరలింగేశ్వర రావు, గారా జాలయ్య, ఎ.శ్రీనివాసరెడ్డి, ఎ.రంగా రెడ్డి, వెంకట సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు ఉచిత ఇసుక ఇవ్వాలి

సీపీఎం నాయకుడు గద్దె చలమయ్య



సత్తెనపల్లిలో వినతి పత్రం అందిస్తున్న సీపీఎం నాయకులు

సత్తెనపల్లి: సార్వత్రిక ఎన్నికల సమయంలో చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు ఉచిత ఇసుకను అందించాలని సీపీఎం నాయకుడు గద్దె చలమయ్య డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉచిత ఇసుక విధానాన్ని అమలు చేసి, భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలని అన్ని మండల కేంద్రాలలో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని సీపీఎం పిలుపు మేరకు పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గద్దె చలమయ్యా మాట్లాడుతూ ప్రభుత్వం ఉచిత ఇసుకను అందిస్తానని హామీ ఇచ్చినప్పటికీ ట్రక్కు ఇసుక ధర రూ.6 వేల వరకు చెల్లించాల్సి వస్తుందన్నారు. అందువల్లన భవన యజమనులు నిర్మాణాలు చేపట్టేందుకు ముందుకు రాక పోవడంతో భవన నిర్మాణ కార్మికులు పనులు లేక చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలో ఇచ్చిన హామీ మేరకు ఆన్‌లైన్ విధానం ద్వారా 24 గంటలు ఉచిత ఇసుకను అందుబాటులో ఉంచే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. తహసీల్దార్ కార్యాలయ సూపరింటెండెంట్ రాజేంద్ర ప్రసాద్‌కు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం పల్నాడు జిల్లా అధ్యక్షుడు అవ్వారు ప్రసాదరావు, సత్తెనపల్లి మండల కార్యదర్శి పెండ్యాల మహేష్, సీఐటీయూ నాయకులు ఆర్.పురుషోత్తం, జడ రాజ్ కుమార్, చేనేత కార్మిక సంఘం నాయకులు అనుమల వీరబ్రహ్మం, కట్ట శివ దుర్గా రావు, భవన నిర్మాణ కార్మికులు షేక్ సైదులు, కోట ఆంజనేయులు పాల్గొన్నారు.

న్యాయవాదులు విధులు బహిష్కరణ



పట్టణంలోని కోర్టు ఆవరణలో న్యాయదేవత విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

సత్తెనపల్లి: కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన చట్టాలను నిరసిస్తూ బార్ ఫెడరేషన్ పిలుపు మేరకు సత్తెనపల్లి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రెండో రోజు శుక్రవారం న్యాయ వాదులు విధులు బహిష్కరించి కోర్టు ఆవరణలోని న్యాయదేవత విగ్రహం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా న్యాయవాదులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన నూతన చట్టాలు న్యాయవాదుల హక్కులను హరించే విధంగా ఉన్నయని పేర్కొన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కంబాల అనిల్ కుమార్, న్యాయవాదులు చిట్టా విజయ భాస్కరరెడ్డి, పిన్నమనేని పాములయ్య, పూజల వెంకట కోటయ్య, దివ్వెల శ్రీనివాసరావు, రాజవరపు నరసింహారావు, కాశిమాల మార్క్, జొన్నలగడ్డ విజయ్ కుమార్ పాల్గొన్నారు.

6న ఆంధ్రప్రదేశ్, తెలంగాణ స్థాయి చెస్ పోటీలు



చెస్‌పోటీలపోస్టర్లు ఆవిష్కరిస్తున్న మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు

మాచర్ల: పట్టణంలోని కిడ్స్ పాఠశాలలో ఈనెల 6న ఆదివారం ఆంధ్రా, తెలంగాణ రాష్ట్రాల స్థాయి చదరంగం (చెస్) పోటీలు నిర్వహించనున్నట్లు పల్నాడు చెస్ అకాడమీ నిర్వాహకుడు కోచ్ కె.కిరణ్‌కుమార్ శుక్రవారం తెలిపారు. రెండు రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు నేరుగా చెస్ పోటీల్లో పాల్గొనవచ్చన్నారు. నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావులు ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు. గౌరవ అతిథులు ఎంఈఓ అల్లి సురేష్, యనముల కేశవరెడ్డి, డాక్టర్ గుర్రం రాజశేఖరరెడ్డి, రిటైర్డ్ డెప్యూటీ డీఈఓ గాదె రామకృష్ణారెడ్డి, కృష్ణవేణి జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ వై.వెంకటరామయ్య, పాఠశాలల ప్రిన్సిపాల్ కె.వి.రామకృష్ణ శాస్త్రి పాల్గొంటారన్నారు. పోటీల నిర్వాహకులు ఇన్నారెడ్డి రైస్‌మిల్లు, శ్రీకృష్ణా జనరల్ హాస్పటల్, ఎస్.కే మేనేజర్ సంజీవ్‌కుమార్, వివిధ కళాశాలలకు చెందిన వారి సహకారంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీలు క్రీడాకారులను సద్వినియోగం చేసుకోవాలని కోచ్ కిరణ్, చెంచురెడ్డి, గట్ల కోటిరెడ్డి కోరారు.